
ప్రజాశక్తి
ఆదివారం 10 ఆగస్టు 2025
5
పార్వతీపురం మన్యం



సీతంపేటలో కొండపోత

ప్రజాశక్తి – సీతంపేట

సీతంపేటలో శనివారం సాయంత్రం కుండిపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రంగా కాసినప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా సిమ్మ చీకటిగా మేఘం కారు మబ్బులతో వాతావరణం చల్లబడి కుండపోత వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి కూడా వర్షం అధికంగా కురవడంతో గెడ్డలు, వాగుల్లో నీరు ప్రవహిస్తుంది. ఇప్పటికే ఏజెన్సీలో సాగునీరు లేక రైతులు వరుణిడి కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో అప్పుడప్పుడు పడ్డ వర్షాలకు నారుపోసి వేసిన రైతులకు తగినంత నీరు లేకపోవడంతో నాట్లు వేయలేకపోయారు. అయితే శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి వరి నాట్లు జరుగుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీ వారసత్వాన్ని కాపాడుకోవాలి

- ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- చదువుతోనే ఉన్నత శిఖరాలకు : కలెక్టర్



పార్వతీపురంలో అడవి తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, పిఒ

ప్రజాశక్తి – పార్వతీపురం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ ప్రజల హక్కులను గుర్తించి, వారి సంస్కృతి, సంప్రదాయాలను, వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఎంతైనా ఉందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ప్రతి ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో జరుపుకుంటున్నామన్నారు. ఆదివాసీలు ప్రకృతితో మమేకమై జీవించే విధానం, జీవనశైలి, జ్ఞానం, సాంస్కృతిక వారసత్వం ఎంతో విలువైనవన్నారు. ఆదివాసీలకు ప్రభుత్వం కల్పించే పథకాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎస్పి ఎస్‌విమాధవ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో తరాల నుంచి ఆదివాసీలు పర్యావరణాన్ని కాపాడుతున్నారన్నారు. ఆదివాసీలు తాము పండించే నాణ్యమైన వస్తువులు ఉపయోగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కొంతమంది ఆదివాసీలు మద్యపానం తయారు చేయడం, సేవించడం చేస్తున్నారని, వారి వల్ల మిగిలిన వారికి చెడ్డ పేరు వస్తుందన్నారు. దీనివల్ల అనారోగ్యం బారిన పడతారని చెప్పారు. గంజాయిలో డబ్బులు వస్తాయని ఎవరో చెప్పడం వల్ల రవాణా తదితర అంశాల్లో భాగస్వాములవుతూ జైలు జీవితం గడుపుతున్న వారు అనేక మంది ఉన్నారని తెలిపారు. భవిష్యత్తు బంగారంలా ఉండాలంటే వ్యసనాలకు బానిసలు కావొద్దని పిలుపునిచ్చారు.

ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఆదివాసీలకు కష్టపడే మనస్తత్వం ఉన్నా, వ్యాపారపరంగా అభివృద్ధి చెందడం లేదని పేర్కొన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిఒ3పై గతంలో జరిగిన సమావేశానికి సంబంధించిన డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రికి పంపామన్నారు. ఆదివాసీ అభివృద్ధి, సంక్షేమానికి గిరిజనాభివృద్ధి సంస్థ పని చేస్తోందని తెలిపారు. గత ఏడాది పదో తరగతిలో 91 శాతం, ఇంటర్‌లో 99 శాతం సాధించిన ఆదివాసీలు ఎందులోనూ తక్కువ కాదని నిరూపించారని అభినందించారు. 6 ఆశ్రమ పాఠశాలల్లో డిఎ జూగా పథకంలో భాగంగా కిచెన్, బిల్డింగ్‌లు మంజూరయ్యాయని తెలిపారు. అంబులెన్సు 7 ఉన్నాయని, మరో 5 మంజూరు చేస్తామన్నారు. 24 ఫీడర్ అంబులెన్సు అందుబాటులో ఉన్నాయని, బర్త్ వెయిటింగ్ 4 మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. 17 గిరిజన పాఠశాలల్లో 4 పూర్తి అయ్యాయని, 13 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. ఆదివాసీ ప్రాంతాల్లో సీసీ రోడ్లును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు మాట్లాడుతూ ఆదివాసీలు అభివృద్ధిలో వెనకబడి ఉన్నారని, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముందు గిరిజన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆదివాసీ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార శాఖ ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను, ఇతర శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలలను ప్రభుత్వ విప్, ఐటిడిఎ పిఒ, ఎస్‌పి సందర్శించారు. కార్యక్రమంలో ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య, ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి, గిరిజన మహిళా నాయకులు మంచాల పారమ్మ, బిడ్డిక తమ్మయ్య, కోలక గౌరమ్మ, గిరిజన మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు


సీతంపేట : స్థానిక ఐటిడిఎ పరిధిలో ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ, మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ తో పాటు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గిరిజన సాంప్రదాయ దుస్తుల్లో గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ నుండి



సీతంపేటలో అడవి తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఐటిడిఎ ప్రాంగణం వరకు సాగింది. తదుపరి ఆదివాసి దేవత విగ్రహానికి ఎమ్మెల్యే, కలెక్టర్, ఐటిడిఎ పిఒ పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. వివిధ గిరిజన పాఠశాల విద్యార్థులు గిరిజన సాంప్రదాయ నృత్యాలతో ఆహూతుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. అంతకుముందు ఐసిడిఎస్ వ్యవసాయ శాఖ, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ, జిసిసి, ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, పాలకొండ డిఎస్‌పి రాంబాబు, డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు, గిరిజన సంక్షేశాఖ ఇంజినీరింగ్ అధికారి కుమార్, ఎఎంసి చైర్మన్ సంధ్యారాణి, సిఐ చంద్రమౌళి, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్రావు, ఎఎంఒ కోటిబాబు, ఉపాధిహామీ ఎపిడి శ్రీహరిరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి, టీఎస్పీ సభ్యులు తేజోవతి మాలయ్య , టిడిపి మండల అధ్యక్షులు సవర తోట మొఖలింగం, పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవి, మాజీ ఎంపిటిసి జయలక్ష్మి, ఆదివాసీ నాయకులు జనార్దన్‌రావు, సుబ్బారావు, కాంతారావు, సత్యారావు, భాస్కరరావు, మూటక రవి, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజన సంఘ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న కలెక్టర్, పిఒ, ఎమ్మెల్యే





సీతంపేట, పార్వతీపురంలో నృత్యాలు చేస్తున్న గిరిజన విద్యార్థినులు



స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి, పిఒ శ్రీవాస్తవ

సబ్ జైల్‌ను తనిఖీ చేసిన జడ్జి

ప్రజాశక్తి – పార్వతీపురం

స్థానిక సబ్ జైలును ఉమ్మడి విజయనగరం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించినారు. ఖైదీల పట్ల సిబ్బంది, తోటి ఖైదీలు ఎటువంటి వివక్షత చూపించరాదని, అలా చేస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆ విషయమై జైలు సూపరింటెండెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్స్ నిర్వహిస్తున్న విధులను పర్యవేక్షించారు. జైల్ క్లినిక్లను సందర్శించే న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు. జైలులో ఉన్న ఖైదీల వివరాలను ప్రతి ఒక్కర్నీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలన్నారు. సకాలంలో న్యాయ సహాయం అందించడానికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్లను ఏర్పాటు చేశామని, వాటిని సక్రమంగా కొనసాగించాలని తెలిపారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యమని తెలిపారు. రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు ఎవరు న్యాయవాది లేకుండా ఉండకూడదని వారికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ న్యాయవాదిని ఉచితంగా అందిస్తుందని తెలిపారు. జైలులో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని భోజనశాలను పరిశీలించారు. స్టోర్ రూమ్ సందర్శించి వంట సరుకులను, పప్పు దినుసులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తనిఖీలో బొబ్బిలి, పార్వతీపురం సబ్ జైళ్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



ప్రజాశక్తి – సాలూరురూరల్

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ సందర్భంగా శనివారం పట్టణం, గ్రామాల్లో సందడి కనిపించింది. సుదూర ప్రాంతాల నుంచి రాఖీలు కట్టడానికి అన్నలు, తమ్ముళ్లు, అక్కలు, చెల్లెళ్ళు సొంత గ్రామాలకు వచ్చారు. రాష్ట్రమంత్రి జి.సంధ్యారాణి అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాఖీ కట్టారు. స్థానిక ఈశ్వరీయ బ్రహ్మకుమారీ విద్యాలయానికి చెందిన ప్రతినిధులు మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసానికి వెళ్లి ఆయనకి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



డీవార్మింగ్ డేకు ఏర్పాట్లు పూర్తి

గరుగుబిల్లి : ఈనెల 12న నిర్వహించనున్న డీ వార్మింగ్ డే కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమల ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. జాతీయ నులిపురుగులు నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నామని తెలిపారు. పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనకు ఆల్బండజోల్ మాత్రలు వేయిస్తామన్నారు. ఏడాది నుంచి 19ఏళ్ల వరకు పిల్లలు, విద్యార్థులకు ఈనెల 12న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాలలో ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్టు తెలిపారు. 1 నుండి 2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర పొడి చేసి నీటితో కలిపి ఇవ్వాలని, 2 నుంచి మూడేళ్ల పిల్లలకు పూర్తి మాత్ర పొడి చేసి నీటితో కలిపి ఇవ్వాలని సూచించారు. 3 నుంచి 19 ఏళ్ల వరకు పూర్తి మాత్ర బాగా నమలాలన్నారు. పిల్లల్లో నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ప్రబలుతాయన్నారు.

అరచేతిలో వైకుంఠం చూపిన బాబు : రాజన్నదొర

ప్రజాశక్తి – సాలూరు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాడేరు పర్యటనకు వచ్చిన సిఎం చంద్రబాబు నాయుడు గిరిజనులకు అరచేతిలో వైకుంఠం చూపించారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆరోపించారు. శనివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎపి రాజకీయాల్లో ఎక్కువ కాలం సిఎంగా పనిచేసిన చంద్రబాబు నాయుడు గిరిజనులకు చేసిందేమీ లేదన్నారు. ఆయన గిరిజనాభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేసి వుంటే ఈరోజు ఏజెన్సీ గ్రామాలు ఇంత దయనీయమైన స్థితిలో ఉండేవి కాదన్నారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న వైసిపిని అభివృద్ధి చేయలేదని విమర్శించడం సరికాదన్నారు. ఆదివాసీ దినోత్సవం రోజైనా పాడేరులో చంద్రబాబు నాయుడు ఎన్నో వరాలు కురిపిస్తారని గిరిజనులు ఆశించారని, కానీ ఆయన ప్రసంగం పాత చింతకాయ పచ్చడి లాగే సాగిందన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై ఎలాంటి భరోసా ఇవ్వలేదని చెప్పారు. షెడ్యూల్ గ్రామాల చేర్పు, జీవో 3 పునరుద్ధరణపై గిరిజనులకిచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వలేదని చెప్పారు. గిరిజనులకు ప్రత్యేక డిఎస్సీ గురించి ప్రస్తావన లేదన్నారు. మెగా డిఎస్సీలోనైనా ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలకు వందశాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇవ్వలేదని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తొలి సంతకం చేసిన ఎఎన్ఎంల నియామకం గురించి చెప్పలేదన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ యువతకు భృతి వంటి సంక్షేమ పథకాలను అమలు చేయకుండానే సూపర్ సిక్స్ అమలు చేశామని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంతవరకు అమలు చేసిన పథకాలు కూడా షరతులు విధించి అర్హులైన వారికి కోత విధించారని చెప్పారు.

అధికారంలోకి వచ్చిన నాటి నుంచే సూపర్ సిక్స్ హామీల అమలు చేస్తామని చెప్పి ఏడాది పాటు పథకాలు ఎగ్గొట్టారని రాజన్నదొర విమర్శించారు.



రెవెన్యూ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కొత్త రెవెన్యూ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

పార్వతీపురంలో రెవెన్యూ ఉద్యోగులకు కొరకు నూతన రెవెన్యూ భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఎపిజెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ ఎన్‌జిఒ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలపై చిత్తశుద్ధి ఏది?

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

ఓవైపు పెరుగుతున్న ధరలు... ఇంకోవైపు తాండవిస్తున్న నిరుద్యోగం... ఇటువంటి పరిస్థితుల్లో దొరికిన పనైనా చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొద్దామనుకున్న వారికి అత్తెసరు కూలి. కనీస వేతనాలన్న మాటే తప్ప, దాని అమలుకు పూనుకోకపోవడమే ఇందుకు తార్కాణమంటూ పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.



ఒప్పంద కార్మికులకు (కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు) కనీస వేతనాలు అమలు చేయాలంటూ జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి కనీస వేతన కమిటీ చైర్మన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించిన సంగతి విధితమే. గ్రామీణ ప్రాంతంలోని అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.510, పట్టణ ప్రాంతాల్లో రూ.910 చొప్పున కనీస వేతనం అమలు చేయాలని కూడా స్పష్టం చేశారు. కానీ, ఆచరణలో ఇదెక్కడా అమలు కాకపోవడం గమనార్హం. ప్రైవేటు రంగంలో మాత్రమే కాదు సుమా..! ప్రభుత్వ రంగంలో అమలుకు నోచుకోలేదు. విజయనగరం, బొబ్బిలి, రాజాం, పార్వతీపురం, పాలకొండ తదితర పట్టణ ప్రాంతాల్లో క్లాత్స్ మర్చెంట్స్ దుకాణాలు, సిఎంఆర్, సౌత్ ఇండియా, చెన్నైయ్ షాపింగ్ మాల్స్ సహా ఎన్నో మాల్స్, బంగారపు షోరూంలు, దుకాణాల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 90శాతం మందికి నెలవారీ వేతనం కేవలం రూ.10వేల నుంచి రూ.15వేలు మాత్రమే. మరీ సీనియర్లకు రూ.20 వేలు లోపే ఉంటోంది. అసలే మన జిల్లాలో పరిశ్రమలు తక్కువ. వాటిలో 20ఏళ్లగా పనిచేస్తున్న కార్మికులకు రూ.20వేలు వేతనం అందడం గగనం. పూసపాటిరేగ ప్రాంతంలోని మైలాన్, హెచ్‌బిఎల్, సిపి ఆక్వా తదితర కంపెనీల్లో ఎక్కడా ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అమలుకు నోచుకోలేదు. రోజువారీ వేతనం రూ.300 నుంచి రూ.రూ.700 లోపే ఉంటోంది. చివరకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కూడా రోజువారీ వేతనం రూ.6వేలకు మించి లేదు. చివరకు పింఛను ఎగ్గొట్టడం కోసం ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తున్న అంగన్‌వాడీ ఆయాలు, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లది కూడా అదే పరిస్థితి. ఈనేపథ్యంలో జిల్లా తలసరి ఆదాయం కూడా తక్కువలో తక్కువగా రూ.1.54లక్షలు మాత్రమే. వాస్తవానికి కార్మికులకు కనీస వేతనం అమలు జరిగితే తలసరి ఆదాయం రూ.3.32లక్షలకు చేరుతుంది. ఈనేపథ్యంలో పని కల్పించకుండా, పని దొరికన చోట పనికి తగ్గవేతనం లేదా కనీస వేతనాలు అమలు చేయకుండా సగటు వ్యక్తి లేదా కుటుంబం కొనుగోలు శక్తి ఎలా పెరుగుతుంది? అనేది ప్రభుత్వానికే ఎరుక. ఈ నేపథ్యంలో పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, డీజిల్ పెట్రోల్, ఇతర అవసరాలు తీర్చుకోవడం కార్మికులకు కష్టంగా మారింది. దీనికితోడు స్కూల్ ఫీజులు, మెడికల్ అవసరాలు తలకు మించిన భారంగా పరిణమిస్తున్నాయని జనం నుంచి ఆవేదన వ్యక్తమౌతునే ఉంది.


స్థానికం వద్దు... దూరమే ముద్దు

- పార్వతీపురంలో పరీక్షా కేంద్రం ఉన్నా సుదూర ప్రాంతాలకు విద్యార్థుల తరలింపు
- అవస్థలు పడుతున్న ఐటిఐ విద్యార్థులు

ప్రజాశక్తి– పార్వతీపురం టౌన్

ఇతర ప్రాంతాలకు వెళ్లి పరీక్ష రాసేందుకు ఐటిఐ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా అధికారులు జిల్లా కేంద్రమైన పార్వతీపురంలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే స్థానికంగా కొన్ని ఐటిఐలు ఈ పరీక్షా కేంద్రాన్ని కాదని సుదూరంలో ఉన్న గజపతినగరం, తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ తరలింపు పట్ల విద్యార్థులకు సమయం భావనే కాకుండా ఆర్థికభారం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐటిఐ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు పార్వతీపురం పట్టణంలో గల జ్యోతి ఐటిఐకి ప్రభుత్వ అనుమతులు ఇచ్చింది. ఈనెల 19న పరీక్షలు జరగనున్నాయి. అయితే స్థానికంగా ఉన్న భ్రమరాంబ, తెర్లి ఐటిఐ యాజమాన్యాలు తమ విద్యార్థులను స్థానికంగా ఉన్న పరీక్షా కేంద్రాన్ని కాదని బొబ్బిలి, గజపతినగరంలో రాసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. స్థానికంగా ప్రభుత్వం పరీక్షా కేంద్రం ఉన్నా ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని పలువురు విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఐటిఐ పబ్లిక్ పరీక్షలు రాసేందుకు జిల్లాలో సెంటర్ కావాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ ఫలితంగా ప్రభుత్వం పార్వతీపురంలోని జ్యోతి ఐటిఐని పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. అయితే స్థానికంగా ఉన్న ఐటిఐలు ఇక్కడ కాదని, దూరంగా విద్యార్థులను తీసుకెళ్లి పరీక్షలు రాసేందుకు సిద్ధపడుతున్నాయి. దీని పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష కేంద్రాలు విద్యార్థులకు అనుగుణంగా నడపాల్సింది పోయి ఐటిఐ యజమానులు కోరికలు తీర్చే పరీక్ష కేంద్రాలుగా మార్చడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులకు ఎటువంటి దూరభారం లేకుండా స్థానికంగా పరీక్షలు రాసుకుంటామన్న వారిని నిరుత్సాహపరుస్తూ ఇబ్బందులు గురి చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై ఐటిఐ జిల్లా డిఆర్‌డిని వివరణకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జిల్లాలో గల ఐటిఐ విద్యార్థులకు స్థానికంగా పరీక్షలు రాయించే ఏర్పాట్లు చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.



వట్టిగెడ్డ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రైతు పక్షపాతి ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం జియ్యమ్మవలస మండలంలో గల రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు ఆర్థికంగా బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే లక్ష్యంతో పంటలకు సాగునీరు, ఎరువులు అందించడమే లక్ష్యంగా పనిచేస్తూ రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఎం. సత్యంనాయుడు, మండల టిడిపి కన్వీనర్ జోగి భుజంగరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రామకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి - కురుపాం

మన్యం జిల్లాలో గిరిజన ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపు గా ట్రైబుల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణకు శనివారం పార్వతీపురం ఐటిడిఎలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఐటిడిఎ పిఒ అషుతోష్ శ్రీవాస్తవ్ సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తాను చేసిన సేవలకు గుర్తించి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. గిరిజనులకు సేవ చేయడానికి ఈ సత్కారం మరింత బాధ్యతను పెంచిందన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు గిరిజన సంఘ నాయకులు అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ గర్భిణీలకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహ, రక్తపోటు, బరువు, ఎత్తు తదితర రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతి కుమారి, శుభారతమని, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.



ఎంపిటిసి తండ్రికి నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

ఎంపిటిసికి పుష్ప శ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మండల కేంద్రంలో గల ఎంపిటిసి గౌడు సంతోషిని తండ్రి గౌడు భాస్కరరావు ఇటీవల అనారోగ్యంతో బాధపడి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శనివారం ఎంపిటిసి సంతోషిని ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అధైర్య పడకుండా ఉండి ఏ అవసరమొచ్చినా తనను సంప్రదించాలని కోరారు. ఆమె వెంట ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, వైసిపి మైనార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి సభ్యులు స్వామియోధులు, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని గుణదతీలేసు పంచాయతీ కొరిశీల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఇటీవల జరిగిన రోడ్డు రపమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి శనివారం కొరిశీల వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె యువకులపై మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. అధైర్యం పడవద్దని, పార్టీ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట మండల వైసిపి కన్వనర్ ద్వారపురెడ్డి జనర్ధన్‌రావు, వైఎస్ ఎంపిపి నంగిరెడ్డి శరత్‌బాబు తదితరులు పాల్గున్నారు.



అడవి తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జట్టు వ్యవస్థాపకులు పారినాయుడు

అడవి తల్లి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి నూతన జట్టు ఆశ్రమంలో అడవి తల్లి విగ్రహాన్ని జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారి నాయుడు శనివారం ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి శిశువుకు జన్మనిచ్చిన అడవి తల్లి విగ్రహం ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సౌదీ అరేబియా నివాసి ఓలేటి గౌరునాయుడు, ధాత్రీ దంపతులు లక్షన్నర రూపాయల విరాళంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఒకప్పుడు అంతా అడవుల్లోనే జీవించామని, నాగరికత పెరిగే కొద్దీ అడవుల స్థానంలో కాంక్రీట్ జంగిల్స్ పుట్టుకురావడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో అనేక ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రకృతిని కాపాడినప్పుడే మనిషి మనుగడ సాఫీగా సాగుతుందని, దీనికోసం అంతా కృషి చేయాలన్నారు. ఎన్ఆర్ఐ గౌరునాయుడు మాట్లాడుతూ 17ఏళ్ల క్రితం జట్టు ట్రస్ట్‌లో తాను పనిచేశానని, ఇప్పుడు జట్టు ట్రస్ట్‌లో లేకపోయినా ట్రస్ట్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అప్పటి నుంచి తన వంతుగా సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. సభ ప్రారంభానికి ముందుగా వి.సన్యాసిరావు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాడిన పాట సభికులను ఆలోచింపజేసింది. కార్యక్రమంలో ప్రముఖ సినీ పాటల రచయిత తుంబలి శివాజీ, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్, ఎం.నూకం నాయుడు, మురళి, ప్రబోద్, సునీల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శివున్నాయుడి ఔదార్యం

పార్వతీపురం టౌన్ : మండలంలోని వెంకంపేటకు చెందిన మాజీ పిఎసిఎస్ చైర్మన్ తీళ్ల శివునాయుడు ఔదార్యం పలువురికి ఆదర్శంగా నిలిచారు. వెంకంపేటంలో ఎవరు మరణించినా ఆ మృతదేహాన్ని దహనం చేసేందుకు అవసరమైన కలపను ఉచితంగా అందజేస్తున్నారు. దహన సంస్కారాలకు అవసరమైన కలపను గ్రామ శివారులో గల శ్మశానవాటికకు కలపను తీసుకువెళ్లే బాధలు తప్పడమే కాకుండా, ఉచితంగా కలప లభిస్తుండడంతో పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉండడమే కాకుండా ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలగడంతో శివున్నా యుడు ఔదార్యానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయడం విశేషం. ఆయనను మరికొందరు ఆదర్శంగా తీసుకునేందుకు అడుగుల వేస్తున్నారు.

గిరిజన హక్కులను రక్షించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన గిరిజనుల హక్కులు, చట్టాలపై దాడులు చేస్తూ వాటిని నిర్వీర్యం చేసే దిశగా పాలన సాగిస్తున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి గిరిజనుడిపై ఉందని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక చైర్మన్ కోలక లక్ష్మణ మూర్తి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలను గుమ్మలక్ష్మీపురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైటిసిలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. నేటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలతో గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. గిరిజన జీవన విధానంపై పక్షపాత వైఖరి అవలంభిస్తూ అడవి నుంచి వెళ్లగొట్టేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే జిఒ 3ను రద్దు చేసి ఏజెన్సీలో నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశాయని అన్నారు. ఆనాటి పోరాటం ఫలితంగా సాధించుకున్న 1/70, చట్టం, జిసిసి, ఐటిడిఎ సంస్థలను రక్షణ లేకుండా చేస్తున్నాయని విమర్శించారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధికి ఏర్పాటు చేసిన ఐటిడిఎలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. నిరుద్యోగ సమస్య ఎక్కువగా కనిపిస్తుందన్నారు. స్పెషల్ డిఎస్‌సితో గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కులు, చట్టాల రక్షణకై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం పటిష్టంగా అమలు కావడం లేదన్నారు. చాలామంది గిరిజనులకు సాగుభూమికి పోడు పట్టాలివ్వని పరిస్థితి ఉందన్నారు. దీంతో గిరిజనులు భూమిపై హక్కు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. ఏజెన్సీలో పరిశ్రమల పేరుతో భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి ఆదివాసీలను



కొమరాడ : జల గ్రామంలో నృత్యం చేస్తున్న గిరిజనులు

అడవి నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇదే జరిగితే తరతరాల నుంచి అడవినే నమ్ముకున్న గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు గడుస్తున్నా గిరిజనులకు విద్య, వైద్యం, తాగునీరు నేటికీ మెరుగుపడలేదన్నారు. గిరిజనుల హక్కులపై ఉద్యమించినప్పుడే రక్షణ ఉంటుందన్నారు. అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఎల్విన్‌పేట నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు గిరిజన సాంస్కృతి, సాంప్రదాయాలు, వేషధారణతో నృత్యాలు చేస్తూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, టిడిపి నాయకులు బిడ్డిక పద్మావతి, గిరిజన నాయకులు నిమ్మక సింహాచలం, అడ్డాకు నరేష్, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్, సిపిఎం నాయకులు ఎం.సన్యాసిరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, యుటిఎఫ్ పత్తిక శంకరరావు, ఆదివాసీ నాయకులు తోయక నాగభూషణ్, తదితరులు ఉన్నారు.

కొమరాడ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని జల గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ప్రసాదు జెండాను ఆవిష్కరించారు. అనంతరం డప్పులతోనూ మహిళలు, పిల్లలు యువకులు నృత్యం చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ప్రసాదు, సెంబురు నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను కాలరాస్తే భవిష్యత్తు పోరాటాలకు గిరిజనులందర్నీ సమాయత్తం చేసి ఉద్యమిస్తామన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కేవలం ఒక్కరోజు పండగ కాకుండా గిరిజన హక్కులకోసం ఉద్యమించే రోజూ కూడా అని అన్నారు. కార్యక్రమంలో గిరిజన యువకులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

కురుపాం :మండలంలోని గుజ్జువాయిలో గుజ్జువాయి, జి.శివడ సర్పంచులు హెచ్. నాగేశ్వరరావు, బి.మిన్నారావు ఆధ్వర్యంలో శనివారం ఆదివాసీ యువత, విద్యార్థులు నృత్యాలతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నీలకంఠాపురం ఎస్సై ఎ.నీలకంఠరావు, ఎపిఎం బి. వెంకట్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఆదివాసీ దినోత్సవం ప్రాముఖ్యతను గిరిజన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య ప్రెసిడెంట్ హెచ్.సుబ్బలక్ష్మి, వైస్ ఎంపిపి ఆరిక రంగారావు, మండలంలో గల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, గిరిజన సంఘం నాయకులు, గిరిజన యువత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వీరఘట్టం : ఆదివాసీ హక్కులు సాధించేందుకు మనమంతా ఐక్యంగా ఉండి పోరాడాలని ఆదివాసీ సంఘ నాయకులు ఎ.జీవన్ కుమార్,



గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

వి.రైకన్న, కె.సుబ్బారావు, సవర మనోజ్ కుమార్, కె.సుగ్రీవులు అన్నారు. మండలంలోని మూలలంక పంచాయతీ గాదిలంకలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవ వేడుకలో పాల్గొని మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కార సాధనకు ప్రతి గ్రామం నుండి ఐదుగురు చొప్పున ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కారానికి మనమంతా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయ సంస్థ కన్వీనర్ నగేష్, కో కన్వీనర్ బి.రాంబాబు, ఎస్.లక్ష్మణ్, కో-ఆర్డినేటర్ ధనరాజు, 14 గ్రామాల నుంచి గిరిజనులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని దుగ్గేరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఘనంగా గిరిజనులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యాన ఆదివాసీ భవన్ వద్ద నుండి ఎస్టీ పేట, రామ భజన మీదుగా సంత తోట వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, ఉపాధ్యక్షులు పీడిక అసిరి, నాయకులు ముండంగి ప్రసాద్ తౌడు పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొన్నారు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సర్పంచులు మిన్నారావు, నాగేశ్వరరావు

సామూహిక వంటశాలల ప్రతిపాదన రద్దు చేయాలి

ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - సాలూరురూరల్

సామూహిక వంటశాలల ద్వారా రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించాలని ప్రభుత్వ ప్రతిపాదనలను వెంటనే రద్దు చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం, సిఐటియు డిమాండ్ చేసింది. ప్రతిపాదనలను వెంటనే విరమించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడారు. రాష్ట్రంలో ఈ పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యా వ్యవస్థ బలోపేతానికి దోహదమైందని, విద్యార్థుల్లో రక్తహీనతలు తగ్గి ఆరోగ్యకరంగా మెరుగైన ఆహారం అందుతుందని అన్నారు. ఈ పథకం లక్ష్యం ముందుకు వెళ్తున్నప్పుడు వంటలను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడమంటే దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి ఉపాధిని పాడు చేయడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్యాన్ని కూడా ప్రభుత్వం పణంగా పెట్టి భవిష్యత్తులో రుచికరమైన వేడివేడి ఆహారాన్ని అందించే దానికి దూరం చేయడమే అవుతుందని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు మెస్‌ఛార్జీలు పెంచాలని, వంటలు నిర్వహించే వారి జీతాలు పెంచాలని ఒకపక్క కార్మికులు ఆందోళన చేస్తుంటే వీరి సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలకు వంటలను అప్పగించాలని చూస్తే పోరాటానికి వెనకడుగు వేయమని హెచ్చరించారు. అధికారంలోకి రాకముందు వేతనాలు, మెస్‌ఛార్జీలు పెంచుతామని హామీలు ఇచ్చి నేడు ఆ హామీల అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. పార్వతీపురంలో ఈనెల 10న (ఆదివారం) భోజన నిర్వహకుల సంఘం మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు రాముడు, రవి, పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

అనంతరం సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

సమావేశం అనంతరం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ షబానా, చొక్కాపు సుశీల గౌరవాధ్యక్షులుగా పారాది శ్రీదేవి, కమిటీ సభ్యులుగా మరో 9 మంది ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్ సుశీల, బి.సింహాచలం, కె.లక్ష్మి, కె.సీతమ్మ, అంబటి సీతమ్మ, ఎస్ సబానా, పి శ్రీదేవి ఎన్నికయ్యారు.

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రంలోని గిరిజన సంఘం ఆఫీసులో శనివారం మధ్యాహ్న భోజన నిర్వహకుల మండల మహాసభ బిడ్డిక సుశీల అధ్యక్షతన జరిగింది. ఈ



సాలూరులో ర్యాలీ చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, మండల కన్వీనర్ కె గౌరీశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో అనేక మార్పులు తీసుకొస్తుందని, మండలానికి ఒకచోట వంట నిర్వహించి విద్యార్థులకు భోజనాన్ని పంపిణీ చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు. 20 ఏళ్లుగా ఈ పథకంలో పనిచేస్తున్న వీరికి వేతనం కేవలం రూ.3వేలు చెల్లించి శ్రమదోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. ఇప్పటికైనా నిర్వాహకులకు కనీస వేతనాలు చెల్లించి, ఉపాధికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో కార్మికులందర్నీ ఐక్యం చేసి పోరాడుతామని భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఆదివారం పార్వతీపురంలో జరిగే మధ్యాహ్న భోజన నిర్వహకుల జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహక సంఘం నాయకులు భువనేశ్వరి, కాంచమ్మ, పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికైంది. సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులుగా బిడ్డిక సుశీల, బి.మాలతి ఉపాధ్యక్షులుగా హేమలత, ఉషారాణి, సహాయ కార్యదర్శులుగా భారతి, తేజోవతి, కోశాధికారిగా కమలమ్మ తదితరులతో మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.

అమెరికా తొత్తులా మోడీ

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - పాలకొండ

అమెరికాకు తొత్తులాగా దేశ ప్రధాని నరేంద్రమోడీ వ్యవహరిస్తున్నారని, ఇది సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి అన్నారు. పాలకొండలో గాయత్రీ కల్యాణ మండపంలో జరుగుతున్న సిపిఐ మహాసభలు సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఎన్‌డిఎ పాలన కార్పొరేటర్‌కు తొత్తుగా మారిందని, అంతర్జాతీయ స్థాయిలో అమెరికాకు తలూపుతూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూడా కూటమి పాలన అధ్వానంగా ఉందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మోడీ తొత్తులుగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని అబాసుపాలు చేస్తున్నారని విమర్శించారు. సనాతన ధర్మమంటూ పవన్ కల్యాణ్ పరిపాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండగా టిడిపి వ్యతిరేకించిన స్మార్ట్ మీటర్లను వారు అధికారంలోకి రాగానే కేంద్రానికి తొత్తుగా మారి బలవంతంగా స్మార్ట్ మీటర్లను ప్రజలపై రుద్దాలని చూస్తున్నారన్నారు. రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ అంతర్‌రాష్ట్రాల జల సమస్యలను కూడా కేంద్రం పరిష్కరించకుండా రాష్ట్రాల మధ్య తగాదాలను ఆస్వాదిస్తుందని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఉన్నప్పటికీ జంఝావతి ప్రాజెక్టు సమస్య నేటికీ పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ కమ్యూనిస్టులంతా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను



మహాసభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు, నియోజకవర్గ నాయకులు బుడిత అప్పలనాయుడు, సీనియర్ నాయకులు నెల్లి సూర్యనారాయణ, ఉత్తరవెల్లి మురళీమోహన్, భారతి తదితరులు ఉన్నారు.

జిల్లా కార్యదర్శిగా మన్మధరావు

మహాసభల అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా కె.మన్మధరావుతో పాటు 31 మందిని కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

అంకిత భావంతో వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణీల ఆరోగ్య శ్రేయస్సుకై వైద్య సిబ్బంది అంకిత భావంతో వైద్యసేవలు అందించాలని, అదే విధంగా గర్భిణీల్లో రక్తహీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా ఉండేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమలప్రసాద్ సిబ్బందికి సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో శనివారం పిఎంఎస్ఎంఎ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి తనిఖీలు నిమిత్తం వచ్చే గర్భిణీలకు అన్ని రకాల రక్తపరీక్షలు చేయడంతో పాటు, ప్రిజం-10 గురించి అవగాహన కల్పించి గర్భిణీలకు అందజేస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. మాతా శిశు సంరక్షణ కార్డులో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించి నివేదికలు హెచ్చు, తగ్గులు గుర్తించి గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గర్భిణీల్లో జ్వర లక్షణాలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి సత్వరమే సమాచారం ఇవ్వాలన్నారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఎక్కువగా నీరు, ద్రవరూప ఆహారాన్ని తీసుకోవాలని గర్భిణీలకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ఎన్ జగదీశ్వరి, హెల్త్ విజిటర్ చింతాడ ఉదయకుమారి, ల్యాబ్



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యాధికారి తిరుమల ప్రసాద్

టెక్నీషియన్ పొన్నగంటి శ్రీనువాసరావు, అంగన్వాడీవర్కర్లు పల్ల కృష్ణవేణి, రౌతు పద్మ, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం.... అన్నదాత హర్షం

ప్రజాశక్తి- వంగర

మండలంలోని శివ్వాం, తలగాం, యయి. సీతారాం పురం, మద్దివలస, గీతనాపల్లి తదితర గ్రామాలలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం వర్షాకాల సీజన్ అయినప్పటికీ గత కొన్నాళ్లుగా వర్షం కురవకపోవడం, ఎండల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.మరోవైపు వరి నారు మళ్లు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం కొంత ఊరట ఇచ్చింది.

గిరిజన సంక్షేమ, అభివృద్ధి పనులపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో జరిగిన అభివృద్ధి పనులపై విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ అనేక అవినీతి కేసుల్లో ఉండి, తాజాగా మరోసారి ఎసిబికి చిక్కిన గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్‌కు గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రుల మద్దతు వున్నట్లు తెలుస్తోందని చెప్పారు. ఆ కోణంలో కూడా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ కోసం ఖర్చు చేయాల్సిన నిధులు కాంట్రాక్టర్లతో కలిసి కొల్లాగొట్టే అవినీతి గిరిజన సంక్షేమ ఇంజనీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్ పై కఠిన చర్యలు తీసుకోవాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ అవినీతి అధికారిని వైసిపి, కూటమి రెండు ప్రభుత్వాలు కాపాడుతూ వస్తున్నాయని రంజిత్ కుమార్ ఆరోపించారు.

విజిలెన్స్ దర్యాప్తు నిర్వహించాలి

సాలూరు: గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై విజిలెన్స్ దర్యాప్తు నిర్వహించాలని ఎస్టీ ఉద్యోగుల సంఘం న్యాయ సలహాదారు రేగు మహేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణలో చేసిన అభివృద్ధి పనులపై కూడా దర్యాప్తు చేపట్టాలని కోరారు. ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి సంబంధించి రూ.35 కోట్లు బిల్లులు మంజూరు చేయడానికి రూ.5కోట్లు లంచం డిమాండ్ చేయడం వెనుక ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలెవరో తేల్చాలన్నారు. అధికార పార్టీ నాయకుల అండ లేకుండా అంత పెద్ద మొత్తంలో చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ డిమాండ్ చేయబోరని చెప్పారు. సమగ్ర దర్యాప్తు జరిపితే గాని వాస్తవాలు వెలుగులోకి రావని రేగు మహేష్ చెప్పారు.

పెదబుడ్డిడిలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెదబుడ్డిడిలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న రావివలస పిహెచ్‌సికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. గ్రామంలో సబ్ సెంటర్ ఉన్న అత్యవసర వైద్యమందడం లేదన్నారు. మండలానికి పెద్ద పంచాయతీ అయినప్పటికీ వైద్య పరంగా ఎటువంటి సదుపాయాల్లేవని చెబుతున్నారు. రాత్రివేళ అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గ్రామంపై దృష్టి సారించి పిహెచ్‌సి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జలాశయం కాలులో పడి సాలూరు వాసి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

పెద్దగెడ్డ జలాశయం కాలువలో పడి సాలూరు గొడగలి వీధికి చెందిన ముంజేటి నాగేంద్రబాబు మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. సాలూరుకు చెందిన ముంజేటి నాగేంద్రబాబు చుట్టుపక్కల గ్రామాల్లో కాళీ ప్లాస్టిక్ సామాగ్రిని వేరుకొని జీవనం సాగిస్తుండేవాడు. యధావిధిగా నాగేంద్రబాబు తన భార్య కరిస్మాతో బాటిళ్లు వేరడానికి వెళ్తానని ఈనెల 7న చెప్పాడు. వెళ్లిన భర్త తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించగా, శుక్రవారం సాయంత్రం పెద్దగెడ్డ జలాశయం కాలువలో పడి మృతి చెందడం గమనించారు. వెంటనే తన భార్య కరిష్మాకు సమాచారం చేరవేయడంతో వెంటనే పాచిపెంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు స్థానిక హెడ్ కానిస్టేబుల్ కృపారావు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సాలూరు సిహెచ్‌సికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం మండలం జమ్మునారాయణ పురంలో గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు.. స్థానికుల కథనం ప్రకారం..భోగాపురానికి చెందిన గీత జమ్మునారాయణపురంలో నివాసం ఉంటోంది. ఆమె భర్త ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మృతి చెందాడు. తరువాత తన స్నేహితుడు భోగాపురానికి చెందిన కొమ్మూరు పార్వతీశ్వరరావు (అలియాస్ శ్రీధర్)తో కలసి జమ్ము నారాయణపురంలో నివాసముంటోంది. గీతను పార్వతీశ్వరరావు పెళ్లి చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. గీత భర్త మృతి చెందిన తరువాత వచ్చిన డబ్బుల విషయమై గీత, పార్వతీశ్వరరావు మధ్య గొడవలు జరగడంతో కొద్దిరోజుల క్రితం పార్వతీ శ్వర రావు బయటకు వెళ్లి పోయాడు .శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చి గీతను బెదిరిద్దామని బ్లేడ్ తో గొంతుకోసుకున్నాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.